నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I హైదరాబాద్, సోమవారం 26 ఆగస్టు 2024 RANGAREDDY




# మరో చాన్స్..

## ఓటరు నమోదుకు అవకాశమిచ్చిన ఎన్నికల సంఘం


- ఈ నెల 20 నుంచే మొదలైన ప్రక్రియ
- అక్టోబర్ 28 వరకు మార్పులు, చేర్పులకు..
- అక్టోబర్ 29న ముసాయిదా జాబితా.. వచ్చే ఏడాది జనవరి 6న తుది జాబితా విడుదల
- జాబితా సవరణకు షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం
- గ్రామ పంచాయతీల్లోనూ చురుకుగా ఓటరు జాబితా
- లోక్‌సభ ఎన్నికల నాటికి జిల్లా ఓటర్లు 36,15,765




రంగారెడ్డి, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ) : ఓటరు నమోదుకు ఎన్నికల సంఘం మరో అవకాశం ఇచ్చింది. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో కొత్త ఓటర్ల నమోదుకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది. ఓటరు జాబితా సవరణ ప్రకారం 18 ఏండ్లు నిండే యువతకు ఓటు హక్కు కల్పించడంతోపాటు మార్పులు, చేర్పులు చేపట్ట నున్నారు. ఈ నెల 20 నుంచే జిల్లాలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ మొదలై చురుగ్గా సాగుతున్నది.

### ఆగస్టు 20 నుంచే..

జనవరి 1, 2025 నాటికి 18 ఏండ్లు నిండే వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. త్వరలోనే పంచాయతీ, మండల, జిల్లాపరిషత్, పురపాలికలకు ఎన్నికలు జరుగనున్నాయి. దాంతో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణ చేపట్టేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా కొత్త ఓటర్ల నమోదుతోపాటు బోగస్ ఓట్ల తొలగింపు, చిరునామాలు మార్చుకోవచ్చు. ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18 వరకు ఓటరు జాబితా సవరణలో భాగంగా బూత్ లెవల్ అధికారులు(బీఎల్‌వో) ఇంటింటికీ తిరిగి పేర్లను పరిశీలిస్తారు. అవసరమైతే పోలింగ్ స్టేషన్ల సర్దుబాటు, మార్పులన్నింటినీ అక్టోబర్ 28 కల్లా పూర్తి చేయనున్నా రు. ముసాయిదా ఓటరు జాబితాను అక్టోబర్ 29న ప్రచురిస్తారు. అక్టోబర్ 29 నుంచి నవంబర్ 28వరకు అభ్యంతరాలపై దరఖాస్తులను స్వీకరిస్తారు. డిసెంబర్ 24లోగా దరఖాస్తులను పరిశీలిస్తారు. తుది ఓటరు జాబితాను 2025 జనవరి 6న విడుదల చేస్తారు. సవరణలో భాగంగా ఓటరు గుర్తింపు కార్డులో చిరునామా, తప్పుల సవరణకూ ఇందులో అవకాశం ఉంటుంది. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు చర్యలు తీసుకోనున్నారు. అదేవిధంగా జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ఓటరు సవరణను పర్యవేక్షించనున్నారు. గతంలో చేపట్టిన విధంగానే బూత్ స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టేలా ఎన్నికల అధికారులు చర్యలు చేపట్టనున్నారు.



### షెడ్యూల్ ఇలా..

- అక్టోబర్ 28 వరకు కొత్త దరఖాస్తుల స్వీకరణ, మార్పులు, చేర్పులకు అవకాశం
- అక్టోబర్ 29న ఓటరు జాబితా ముసాయిదా ప్రకటన
- అక్టోబర్ 29 నుంచి నవంబర్ 28 వరకు అభ్యంతరాల స్వీకరణ
- ఏదో ఒక శని, ఆదివారాల్లో ప్రత్యేక కార్యాచరణ నిర్వహణ
- డిసెంబర్ 24లోగా అభ్యంతరాల పరిశీలన
- 2025 జనవరి 6న తుది జాబితా ప్రకటన

### ఏ ఫారం ఎందుకోసం ?

- ఫారం-6 : కొత్తగా ఓటర్ల నమోదుకు ఫారం-6ను ఉపయోగించాలి. రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు(లేకుంటే నివాస ధ్రువీకరణ పత్రం) జతపర్చాలి.
- ఫారం-6ఏ: ఎన్ఆర్ఐలు ఫారం-6ఏను ఉపయోగించాలి. ఇందుకు తాము నివాసముంటున్న దేశంలో సిటిజన్‌షిప్ లేదని, అక్కడి అంబాసిడర్‌తో డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది.
- ఫారం-7: ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు కోసం ఫారం-7ను ఉపయోగించాలి. విచారించిన తర్వాత పేర్లు తొలగిస్తారు.
- ఫారం-8 : పేరు, పుట్టిన తేదీల్లో తప్పులను సవరించేందుకు ఫారం-8ను ఉపయోగించాలి. ఈ ఫారానికి సరి చేయాల్సిన పేరుకు సంబంధించిన డిక్లరేషన్.. 10వ తరగతి మెమో లేదా డ్రైవింగ్ లైసెన్స్‌లలో ఏదో ఒకటి జతపర్చాలి.
- ఫారం-8 ఏ : చిరునామా మార్చేందుకు ఫారం-8ఏను ఉపయోగించాలి. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బదిలీ అయిన వారు పూర్వ చిరునామాతో ఉన్న గుర్తింపు కార్డు జిరాక్స్, ప్రస్తుత చిరునామా ధ్రువీకరణ పత్రాన్ని జతచేస్తే సరిపోతుంది.

### గ్రామ పంచాయతీల్లో చురుగ్గా ఓటరు జాబితా ..



గ్రామపంచాయతీ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారన్న దానిపై స్పష్టత లేనప్పటికీ రాష్ట్ర ఎన్నికల సంఘం మాత్రం ఓటరు జాబితా రూపకల్పనపై దృష్టి సారించింది. పంచాయతీ ఎన్నికల కసరత్తులో భాగంగానే షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ క్రమంలో వార్డుల వారీగా ఓటరు జాబితా ప్రక్రియ చురుగ్గా సాగుతున్నది. 2011 జనాభాను పరిగణనలోకి తీసుకుని వార్డుల సంఖ్యను నిర్ధారించారు. గ్రామంలో ఉన్న ఓటర్ల సంఖ్య, అన్ని వార్డుల్లో సమానంగా ఉండేలా చర్యలు తీసు కుంటున్నారు. వార్డుల వారీగా జాబితాను తయారు చేసేందుకు గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉప యోగించిన ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకుంటున్నారు. ఉన్నతాధికారుల పరిశీలన అనంతరం సెప్టెంబర్ 6న ముసాయిదా జాబితాను ప్రకటిస్తారు. వాటిపై అభ్యంతరాలను స్వీక రించనున్నారు. సెప్టెంబర్ 21న తుది జాబితాను ప్రకటిస్తారు.

**జిల్లాలో ప్రస్తుతం ఉన్న ఓటర్ల వివరాలు..**

| నియోజకవర్గం | పురుషులు | స్త్రీలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| ఇబ్రహీంపట్నం | 1,69,713 | 1,67,293 | 36 | 3,37,042 |
| ఎల్బీనగర్ | 3,12,163 | 2,88,153 | 134 | 6,00,450 |
| మహేశ్వరం | 2,85,137 | 2,71,538 | 66 | 5,56,741 |
| రాజేంద్రనగర్ | 3,16,979 | 2,95,153 | 38 | 6,12,170 |
| శేరిలింగంపల్లి | 4,00,361 | 3,57,600 | 141 | 7,58,102 |
| చేవెళ్ల | 1,35,429 | 1,34,526 | 05 | 2,69,960 |
| కల్వకుర్తి | 1,22,805 | 1,20,148 | 09 | 2,42,962 |
| షాద్ నగర్ | 1,19,114 | 1,19,211 | 13 | 2,38,338 |
| మొత్తం | 18,61,701 | 17,53,622 | 442 | 36,15,765 |





పంట రుణాలు మాఫీ అవుతాయని ఎంతో ఆశగా ఎదురుచూసిన రైతన్నకు భంగపాటే మిగిలింది. ప్రభుత్వం విధించిన నిబంధనలు వారి పాలిట శాపంగా మారాయి. అన్ని అర్హతలున్నా మా క్రాప్ లోన్ ఎందుకు మాఫీ కాలేదని తెలుసుకునేందుకు అన్నదాతలు వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రూ.2 లక్షల వరకు ఎలాం టి షరతుల్లేకుండా పంట రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించిన రేవంత్‌రెడ్డి.. అధికారంలోకి రాగానే.. అనేక కొర్రీలు, మెలికలు పెట్టడంపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. పరిగి మండలంలోని చిగురాల్‌పల్లి గ్రామంలో రుణాలు తీసుకున్న వారిలో 40 శాతం మందికే మాఫీ వర్తించడంతో.. మిగిలిన రైతులు మా రుణాలు మాఫీ అవుతాయా.. లేవా..? అని ఆందోళన చెందుతున్నారు.

# మాకెప్పుడు మాఫీ

- అర్హత ఉన్నా.. వర్తించని రుణమాఫీ
- బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణలు
- మండలంలోని చిగురాల్‌పల్లిలో 40 శాతం మందికే మాఫీ వర్తింపు
- మా రుణాలు మాఫీ కావా..? అంటూ అర్హుల ఆందోళన

పరిగి, ఆగస్టు 25 : అర్హులైన వారికి కూడా రుణమాఫీ కాకపోవడంతో రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతున్నది. ఒకవైపు ప్రభుత్వం అర్హులందరికీ రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పుకొంటుండగా.. రుణమాఫీ కాని అర్హులు మా లోన్ ఎందుకు మాఫీ లేదని తెలుసుకునేందుకు వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎవరిని అడిగినా సరైన సమాధానం రాకపోవడంతో అసలు మాకు రుణమాఫీ అవుతుందా లేదా అని తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రూ.2 లక్షల వరకు ఎలాంటి షరతుల్లేకుండా పంట రుణాలను మాఫీ చేస్తామని అప్పటి పీసీసీ అధ్యక్షుడి హోదాలో హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే.. అనేక కొర్రీలు, మెలికలు పెట్టడంపై అన్నదాతల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఒకే విడతలో రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని ప్రకటించి తీరా మూడు విడుతల్లో ప్రక్రియను తూతూమంత్రంగా పూర్తి చేయడంపై మండిపడుతున్నారు. పరిగి మండలంలోని చిగురాల్‌పల్లి గ్రామంలో రుణాలు తీసుకున్న వారిలో 40 శాతం మందికే రుణమాఫీ వర్తించడం గమనార్హం. ఈ గ్రామంలో సుమారు 700 పైచిలుకు రైతులున్నారు. పరిగిలోని యూనియన్ బ్యాంకు, పీఏసీఎస్‌లలో వారు రుణాలు తీసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీలో భాగంగా మొదటి విడతలో చిగురాల్‌పల్లిలో లక్ష లోపు 95 మందికి, రెండోవిడతలో లక్షన్నర వరకు 39 మందికి రుణమాఫీ కాగా.. మూడో విడతలో రూ.2 లక్షల వరకు రుణమాఫీకి సంబంధించి బ్యాంకుల వారీగా వివరాలను పంపించడంతో పూర్తిస్థాయిలో ఎంతమందికి వర్తించిందనే విషయాన్ని సైతం అధికారులు చెప్పలేకపోతున్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా రేవంత్‌రెడ్డి రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించి తీరా కొంత మంది రుణాలే మాఫీ చేయడంపై అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రేషన్‌కార్డు, కొర్రీలు లేకుండా అందరి రుణాలను మాఫీ చేయాలని కోరుతున్నారు. కేసీఆర్ హయాంలో వ్యవసాయాన్ని పండుగగా మార్చారని.. రైతుబంధు పథకంతో ఏడాదికి రెండు పంటలకు పెట్టుబడి సాయాన్ని సకాలంలో అందించేవారని గుర్తు చేసుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సక్రమంగా రైతుబంధు పెట్టుబడి సాయాన్ని పంపిణీ చేయడం లేదని మండిపడుతున్నారు. గత యాసంగిలో కొంతమందికే పెట్టుబడిసాయాన్ని అందించగా.. ఈ వాన కాలంలో ఇప్పటివరకూ రైతుబంధు సాయాన్ని ఇవ్వలేదని.. ప్రజాప్రభుత్వం అంటూ అన్నదాతల సంక్షేమాన్ని ఈ ప్రభుత్వం విస్మరిస్తున్నదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### రూ.2లక్షల వరకైనా మాఫీ చేయాలి



నాకు 3.8 ఎకరాల భూమి ఉన్నది. పరిగిలోని యూనియన్ బ్యాంకులో రూ.1.80 లక్షలు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏడీబీలో రూ.1.60 లక్షలు పంటల సాగు కోసం తీసుకున్నా. నాకు తెల్ల రేషన్‌కార్డు ఉన్నా ఒక్క రూపాయి కూడా రుణమాఫీ కాలేదు. రైతు పేరిట ఎంత రుణం ఉన్నా రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేయాల్సిందే. ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం రూ. రెండు లక్షల వరకు మాఫీ చేస్తే మిగిలిన మొత్తాన్ని చెల్లిస్తా. ప్రభుత్వం హామీ నెరవేర్చకుండానే గొప్పలు చెప్పుకోవడం తగదు.

– శేరి చిన్నయ్య, చిగురాల్‌పల్లి, పరిగి

### ప్రాసెస్‌లో ఉందని చెబుతున్నారు



నాకు 4.05 ఎకరాల భూమి ఉన్నది. యూనియన్ బ్యాంకులో రూ.1,60,000 రుణం తీసు కున్నా. మూడు విడతల్లోనూ నా క్రాప్ లోన్ మాఫీ అయినట్లు మెసేజ్ మాత్రం రాలేదు. ఇదే విషయాన్ని వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్తే ప్రాసెస్‌లో ఉందని చెబుతున్నారు. అన్ని అర్హతలున్నా నా రుణం ఎందుకు మాఫీ కాలేదు? ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అందరి రుణాలను మాఫీ చేసి మాట నిలబెట్టుకోవాలి.

– మోముల ఆంజనేయులు, చిగురాల్‌పల్లి, పరిగి

# ఎమర్జెన్సీ కాకున్నా.. సైరన్ !

## చిన్నచిన్న కారణాలకే మోగిస్తూ.. దూసుకెళ్తున్న అంబులెన్స్‌లు

**రోగికి అత్యవసర సమయంలో వైద్యసేవలు అందించేందుకు సైరన్‌ను వాడుతూ.. అంబులెన్స్‌లు వేగంగా వెళ్లాల్సిన అవసరం ఉంటుంది. ఆ సమయంలో ట్రాఫిక్ పోలీసులు సైతం రూట్ క్లియర్ ఇస్తుంటారు. అయితే ఇటీవల ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన సర్వేలో చాలా సందర్భాల్లో అత్యవసర సమయం కానప్పుడు కూడా అంబులెన్స్ డ్రైవర్లు.. సైరన్లు వాడుతూ.. వెళ్తున్నట్లు గుర్తించారు. చికిత్స అనంతరం రోగిని ఇంటికి తీసుకెళ్లే సమయంలో.. అనారోగ్యంతో ఉన్న వ్యక్తులు.. ఉద్యోగులు.. వివిధ రకాల శాంపిళ్ల కలెక్షన్లు.. మృతదేహాలను తరలించేటప్పుడు.. ఇలా అంబులెన్స్ డ్రైవర్లు సైరన్‌ను ఉపయోగిస్తున్నట్లు తేలింది. అత్యవసర సమయాల్లోనే సైరన్‌ను వాడాలని.. దుర్వినియోగం చేయవద్దని డ్రైవర్లకు నగర ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు.**

*- సిటీబ్యూరో, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ)*



ట్రాఫిక్ పోలీసులు అంబులెన్స్ సర్వీస్‌లకు సంబంధించిన సైరన్‌ను ఎలా వాడుతున్నారు..దాని దుర్వినియోగంపై ఒక సర్వే చేశారు. ఇందుకు గత నెల 23వ తేదీ నుంచి 27వ తేదీ మధ్యలో అక్కడక్కడ జంక్షన్ల వద్ద 310 అంబులెన్స్ సేవల గురించి ఆరా తీశారు. అందులో అత్యధికంగా 152 అంబులెన్స్‌లు (49%) శాంపిళ్లను తీసుకొని వెళ్తున్నవే ఉన్నాయి.. అలాగే వివిధ కారణాలు చెప్పినవి 121 (39%), మృతదేహాలను తీసుకెళ్తున్నవి 20 (6.5%), ఖాళీగా వెళ్తున్నవి 17 (5.5%) ఉన్నట్లు తేలింది. ఇలా సగానికిపైగా అంబులెన్స్‌ల సైరన్లు దుర్వినియోగం అవుతున్నట్లు పోలీసులు గుర్తించారు. రోగికి అత్యవసరంగా వైద్యసేవలు అందించేందుకు సైరన్‌ను వాడుతూ.. అందరి సహకారంతో అంబులెన్స్‌లు వేగంగా వెళ్లాల్సిన అవసరముంటుంది. అయితే ఆ రోగికి అత్యవసరం కాకున్నా..అంబులెన్స్ ఉందంటే సైరన్ వేసుకొని వెళ్లేవారు చాలా మంది ఉంటున్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు.. ఎవరైనా ప్రాణాపాయ స్థితిలో ఉంటే.. అప్పుడే పుట్టిన పసిపాపలు.. ఇలా కొన్ని సందర్భాల్లో తప్పని సరిగా అంబులెన్స్ సైరన్ వాడాల్సిందేనని పోలీసులు సూచిస్తున్నారు. రోగి చికిత్స అనంతరం అంబులెన్స్‌లో ఇంటికి వెళ్తుండడం, మృతదేహాలను తరలించడం, అనారోగ్యంగా ఉన్న వారిని, ఉద్యోగులు, వివిధ రకాలైన శాంపిళ్లను తీసికెళ్లే సమయంలోనూ అంబులెన్స్ సైరన్‌ను దుర్వినియోగం చేయవద్దని నగర ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్ సూచనలు చేస్తున్నారు.

- 49 శాతం శాంపిళ్ల కోసమేనట..
- ట్రాఫిక్ పోలీసుల సర్వేలో పలు అంశాలు గుర్తింపు
- సైరన్‌ను దుర్వినియోగం చేయొద్దు
- అంబులెన్స్ డ్రైవర్లకు పోలీసుల స్పష్టీకరణ
- స్వీయ నియంత్రణ అవసరమంటూ.. హితవు
- అత్యవసర సమయాల్లోనే సైరన్ వాడాలంటూ సూచన




### ఒక జంక్షన్ నుంచి 5 నుంచి 6 అంబులెన్స్‌లు

అంబులెన్స్ సైరన్‌తో వెళ్తుంటే.. రోడ్డుపై వెళ్లే వాహనదారులతో పాటు జంక్షన్ల వద్ద పోలీసులు ట్రాఫిక్ క్లియరెన్స్ ఇస్తుంటారు. ఆటోమెటిక్ వ్యవస్థ ఉన్న చోట ట్రాఫిక్ పోలీసులు అప్పటికప్పుడు సిగ్నళ్లను మాన్యువల్‌గా మార్చేసి అంబులెన్స్‌లకు దారిస్తుంటారు. ఇలా ఒక గంటలో ఒక జంక్షన్ నుంచి 5 నుంచి 6 అంబులెన్స్‌లు వెళ్తుంటాయి. ఆ సమయంలో ఆటోమెటిక్ నుంచి మాన్యువల్ మోడ్‌కు సిగ్నల్ వ్యవస్థను మార్చాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే కొన్ని అంబులెన్స్‌లు నాన్ ఎమర్జెన్సీ సందర్భాల్లోనూ సైరన్ మోగిస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు సర్వే ద్వారా గుర్తించారు.

### త్వరలోనే సాఫ్ట్‌వేర్

అంబులెన్స్ డ్రైవర్లకు అవగాహన కల్పించడంలో భాగంగా ఇటీవల కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో హాస్పిటళ్ల యాజమాన్యాలు, ప్రైవేట్ అంబులెన్స్ అసోసియేషన్స్, అంబులెన్స్‌లు కలిగి ఉన్న డయాగ్నోస్టిక్ ల్యాబొరేటరీస్ యాజమాన్యాలతో నగర ట్రాఫిక్ పోలీస్ అదనపు సీపీ విశ్వప్రసాద్ నేతృత్వంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. అంబులెన్స్ సైరన్‌ను దుర్వినియోగం చేయవద్దని, అత్యవసర పరిస్థితులు, అత్యవసరం కాని పరిస్థితులను వేర్వేరుగా చూడాలని సూచించారు. ఇందుకు స్వీయ నియంత్రణ అవసరమని అంబులెన్స్ డ్రైవర్లు, దవాఖానల యాజమాన్యాలకు సూచించారు. ఎమర్జెన్సీ, నాన్ ఎమర్జెన్సీలకు సంబంధించిన ఏర్పాట్ల విషయంలో ఒక సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌ను తయారు చేస్తున్నామని, త్వరలోనే దానిని అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు.



# గ్రామ దేవతల ఆశీస్సులు ప్రజలపై ఉండాలి

- ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితారెడ్డి

కందుకూరు, ఆగస్టు 25 : ప్రజలపై గ్రామ దేవతల ఆశీస్సులు ఉండాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కోరారు. లేమూరు గ్రామంలో గ్రామ దేవతలు పోచమ్మ, మైసమ్మల విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవంలో ఆమె పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భగవంతుని కృప ప్రతి ఒక్కరిపై ఉండాలని అమ్మ దయ ఉంటే అన్ని ఉన్నట్లేనని అన్నారు. దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. మాజీ ఉప సర్పంచ్ సురుసాని కొండల్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎలుక మేఘనాథ్‌రెడ్డి, గంగాపురం లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ ఢిల్లీ గణేశ్, గల్వి జైపాల్, సంజీవరెడ్డి, మహేందర్, నారాయణ, అర్జున్, శ్రీధర్, నవీన్, జంగయ్య పాల్గొన్నారు.

**కందుకూరు మండల పరిధిలో బోనాలు..**

కందుకూరు మండల కేంద్రంతో పాటు నేదునూరు, అగర్‌మియాగూడ, జైత్వారం గ్రామాల్లో ఉదయం అమ్మవారికి బోనాలను సమర్పించారు. అనంతరం తొట్టెల ఊరేగింపులను నిర్వహించారు. మండల కేంద్రంలో నవతరం యూత్ సభ్యులతో పాటు ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యులు ప్రశాంత్‌చారి, తాళ్ల కార్తీక్, సొడపు వెంకటేశ్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు బొక్క దీక్షిత్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యదర్శి కుంచకూరి వెంకటేశ్వర్లు గుప్తా, మాజీ ఉప సర్పంచ్ గుండ్ర సుధాకర్‌రెడ్డి, బీజేపీ మండల కార్యదర్శి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లేమూరులో నిర్వహించిన గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితారెడ్డి